క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఈఆర్వో వెంకటరావు

పద్మనాభం: మండలంలోని 45 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఏఈఆర్వో ఎస్.వెంకటరావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం బీఎల్‌వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ స్టేషన్లలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. బీఎల్‌వోలందరూ వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఈవోఆర్డీ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ నియోగ్, ఆర్ఐ కోటీశ్వరరావు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

ఆనందపురం : మండలంలోని వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెంలో ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం ఆలిపూర్ గ్రామానికి చెందిన పరిమాల్ దేవనాథ్ (41) తన కుటుంబంతో ఏడాదిన్నర క్రితం ఉపాధి కోసం వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెం గ్రామానికి వలస వచ్చాడు. బొడ్డపాలెంలోని ప్లేవుడ్ కంపెనీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి భార్య పింకీ సాహుతోపాటు ముగ్గురు ఆడ పిల్లలు, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. కాగా మద్యానికి బానిసైన పరిమాల్ దేవనాథ్ కొంత కాలంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. కుటుంబ పోషణ కూడా కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో సోమవారం ఇంట్లో గల ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుని భార్య పింకీ సాహు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ శివ సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసుని హెచ్‌సీ ధనలక్ష్మి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు పంచాంగ శ్రవణం

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం (టీటీడీ)లో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉదయం 9 గంటల నుంచి పంచాంగ శ్రవణం నిర్వహించనున్నట్లు ఆలయ ఏఈవో జగన్‌మోహనాచార్యులు ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు నూతన సంవత్సరాది సందర్భంగా మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో శ్రీవారిని దర్శించుకునేందుకు వస్తారని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

- భీమిలి బీచ్‌రోడ్డు మంగమారిపేట వారీజా ఆశ్రమం, శ్రీ లక్ష్మీ హయగ్రీవ మందిరంలో మంగళవారం ఉదయం 9 గంటలకు పంచాంగ శ్రవణం నిర్వహించనున్నారు. అదేవిధంగా ఈ నెల 9 నుంచి 17 వరకు వసంత నవరాత్రుల్లో భాగంగా రోజూ 8 గంటల నుంచి 9 వరకు సుందరాకాండ పారాయణ చేయనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు.

భైరవస్వామికి ప్రత్యేక పూజలు



సింహాచలం: కొత్త అమవాస్య పురస్కరించుకుని భైరవవాకలోని భైరవస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము 4గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు తరలివచ్చి భైరవస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున దీపారాధన చేశారు. భక్తులతో ఆలయానికి వెళ్లే రెండు కిలోమీటర్ల మార్గం కిటకిటలాడింది. గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ జి.శ్రీనివాసరావు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

అర్రెమ్మ మృతికి సంతాపం



భీమునిపట్నం: భీమిలిలోని కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు అల్లిపిల్లి అర్రెమ్మ (72) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. సుమారు 40 సంవత్సరాలుగా ఆమె పార్టీలో వుంటూ పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పని చేసి గుర్తింపు పొందారు. ఆమె మృతికి పలువురు సంతాపం తెలియజేశారు.

అందుబాటులో వున్న వారినే ఎన్నుకోండి



యాతపేటలో మహిళలకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



రామన్నపేటలో మహిళలకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస : తనను ఎమ్మెల్యేగా ఎన్నుకుంటే ఇక్కడకు అర కిలోమీటరు దూరంలోని అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో నిత్యం అందుబాటులో వుంటానని... అదే గంటా శ్రీనివాసరావు ఎమ్మెల్యే అయితే నాయకులకు కూడా అందుబాటులో వుండడని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ ఒకటో వార్డు బాలాజీనగర్, రామన్నపేట, వెంకటేశ్వరమెట్ట తదితర గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాతపేటను టీడీపీ ప్రభుత్వం గతంలో పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన గత ఐదేళ్లలో రూ.1.35 కోట్లతో అభివృద్ధి చేసి వసతులు కల్పించామన్నారు. బాలాజీనగర్ సచివాలయం పరిధిలో రూ.26 కోట్ల సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే సచివాలయాలు, వలంటీర్లు, సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. పొరపాటున టీడీపీ గెలిస్తే భీమిలిలో మళ్లీ భూ దందాలు, అవినీతి, జన్మభూమి కమిటీల లంచగొండితనం విచ్చలవిడిగా పెరిగిపోతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టీడీపీ నాయకులకు కూడా పార్టీరహితంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంచి జరిగితేనే ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్పొరేటర్ నుంచి ముఖ్యమంత్రి వరకు అందరూ వైఎస్సార్‌సీపీ వారుంటే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. అవినీతి టీడీపీకి ఇవే చివరి ఎన్నికలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, రెండో వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ రమణ, కొప్పల రమేష్, ఉప్పాడ నాగేశ్వరరావు, చిప్పాడ వెంకటేష్ గూడెల నాని, పిల్లా త్రినాథ్, రమణ, మధు, బంక శ్రీను, అక్కరమాని చినబాబు, కుంచా శివరామకృష్ణ, పల్లా పెంటరాజు, కుప్ప అప్పయ్యమ్మ, పీతల వెంకట అప్పారావు, తమ్మిన నరసింగరావు, చింతగుంట శివ, జీరు సుజాత, చిల్ల ప్రమీల, వెంపాడ వెంకటరమణ, జగన్నాథ ఎల్లాజీ, పందిరి విజయ్, శీరపు నరసింహారావు, చేట్ల ఎల్లయ్యరెడ్డి, చిల్ల గణేష్‌రెడ్డి, మద్ది మహాలక్ష్మి, గంద్రేటి ఈశ్వరరావు, చేట్ల అప్పలసూరమ్మ, సిమ్మల ప్రసన్న, తమ్మిన అశోక్, దుర్రి రామయ్యమ్మ, గిడుతూరి మురళి, వంశీరెడ్డి, జీరు పద్మ, దుంప సాయిరెడ్డి, కొయ్య వెంకటలక్ష్మి, నమ్మి మాధవ, కుమిలి సూర్యనారాయణ పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో రేషన్‌కార్డుకు రూ.700



మేము విజయవాడ నుంచి రామన్నపేట వచ్చిన కొత్తలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో వుంది. రేషన్‌కార్డు కోసం జన్మభూమి కమిటీ ప్రతినిధులను సంప్రదించగా రూ.500 తీసుకున్నారు. తర్వాత భీమిలి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తే రూ.200 తీసుకున్నారు. మొత్తంగా రేషన్‌కార్డు కోసం రూ.700 తీసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పైసా ఖర్చు లేకుండా ఎంతో మందికి రేషన్‌కార్డులు ఇళ్లకు తీసుకొచ్చి అందించారు. అన్ని సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందిస్తున్నారు.

– దుర్గాశి రేవతి, రామన్నపేట

అభివృద్ధి చేశా... మళ్లీ గెలిపించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ఇఫ్తార్ విందులో ముస్లిం మత పెద్దలతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది : గడిచిన ఐదేళ్లలో భీమిలి నియోజకవర్గ అభివృద్ధికి చేసిన కృషిని గుర్తించి రానున్న ఎన్నికల్లో తనను మరోసారి గెలిపించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ దరి సుభాష్‌నగర్ కాలనీలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరిస్తూ స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేశానని పేర్కొన్నారు. కొంత మందిలా ఎన్నికలు అయిపోయిన తర్వాత ముఖం చాటేసి వేరొక నియోజకవర్గానికి వలసపోయే నాయకుడిని కాదని వివరించారు. పేదల పక్షాన నిలిచే మనసున్న ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని, అందుకు నిదర్శనమే గత ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలన్నారు.

త్యాగానికి ప్రతీక రంజాన్

రంజాన్ పండగ త్యాగనిరతికి ప్రతీక అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సాగర్‌నగర్ దరి తాటిచెట్లపాలెం వద్ద గల మసీదులో ముస్తఫా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందని, రంజాన్ పండగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని, ఈ పండగను ముస్లింలు సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో కార్పొరేటర్ లొడగల అప్పారావు, వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, నాయకులు ఉప్పులూరి గోపి, లొడగల రామ్మోహన్, అల్లాడ ఉమామహేశ్వరరావు, ముదుండి రాజేశ్వరి, దువ్వి వాసు, ఎరుపల్లి అప్పలరాజు, మాదు చంటి, చిల్లా శ్రీనివాసరెడ్డి, ఇల్లాపు వెంకటరావు పాల్గొన్నారు.

టీడీపీ ప్రచారానికి ఝలక్

పిలిచినా రాని జనసేన, బీజేపీ నాయకులు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డులో టీడీపీకి షాక్ తగిలింది. సూపర్‌సిక్స్ పథకాల పేరుతో ప్రచారానికి టీడీపీ 4వ వార్డు నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి వార్డులోని జనసేన, బీజేపీ నాయకులు తప్పనిసరిగా పాల్గొని ఉమ్మడి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు గెలుపునకు కృషి చేయాలని కోరారు. వార్డులో కాపులుప్పాడ, రెడ్డీలపాలెం, సోమన్నపాలెం, పరదేశిపాలెం ప్రాంతాల్లో ప్రచారాన్ని మొదలుపెట్టారు. అయితే ఈ ప్రచారానికి జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు రాకపోవడంతో టీడీపీ శ్రేణులు కంగుతిన్నారు. ఒకవైపు ప్రజల నుంచి స్పందన లేకపోవడం, జనసేన, బీజేపీ నాయకులు రాకపోవడంతో చేసేదేమీ లేక ప్రచారాన్ని మమ అంటూ ముగించేశారు. ముఖ్యంగా ప్రచారంలో టీడీపీ 4వ వార్డు కీలక నాయకులు కూడా కనిపించకపోవడం గమనార్హం.

నూకాలమ్మ దర్శనానికి భారీగా భక్తులు



అమ్మవారి దర్శనానికి వెళ్తున్న భక్తులు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ ముత్తంశెట్టి లక్ష్మీ ప్రియాంక

భీమునిపట్నం: భీమిలి గ్రామ దేవత నూకాలమ్మ ఉత్సవాల్లో భాగంగా సోమవారం అనుపోత్సవం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భీమిలి నియోజకవర్గంతోపాటు విశాఖ, విజయనగరం జిల్లాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున విచ్చేశారు. వీరికి ఆలయ కార్యనిర్వాహక అధికారి బొంగరాల మురళీమోహన్ అవసరమైన ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు చలివేంద్రం ఏర్పాటు చేసి భక్తులకు మంచినీరు అందించారు. అంతకు ముందు రోజు ఆదివారం రాత్రి గంటస్తంభం వేదిక ఎదురుగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున బాణసంచా కాల్చారు.

ఘనంగా నూకాలమ్మ జాతర

కొమ్మాది : జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది పరిధి సేవానగర్‌లో సోమవారం నూకాలమ్మ జాతర మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి చుట్టు పక్కల ప్రాంతాల్లో గల మహిళలు పసుపు, కుంకుమ సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవం సందర్భంగా పులి వేషాలు, తప్పెటగుళ్లు, కోలాటాలు నిర్వహించారు.

అమ్మవారిని వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి లక్ష్మీ ప్రియాంక కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా నూకాలమ్మ ఉత్సవాలు ప్రారంభం

పద్మనాభం : మండలంలోని పొట్నూరు, రెడ్డిపల్లి గ్రామాల్లో రెండు రోజులు జరగనున్న నూకాలమ్మ ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.

వ్యవసాయ బళ్లను రథాలుగా తీర్చిదిద్ది పొట్నూరులోని నూకాలమ్మ ఆలయం చుట్టూ తిప్పారు. ఈ సందర్భంగా మహిళలు ముందుగా గ్రామంలోని చతకం పట్టు వద్ద పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్దకు చేరుకుని పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో మంగళవారం తిరునాళ్లు నిర్వహించనున్నారు.



చతకం పట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు

సత్వరమే జోనల్ ఆఫీస్ మరమ్మతులు

జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్



మధురవాడ జోనల్ ఆఫీసు మరమ్మతుల ప్లాన్ పరిశీలిస్తున్న విశ్వనాథన్

మధురవాడ: జీవీఎంసీ జోన్ – 2 కార్యాలయం మరమ్మతులు సత్వరమే, నాణ్యతతో చేపట్టాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్ ఆదేశించారు. సోమవారం మధురవాడ జోనల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా ఆయన సందర్శించారు. ఇక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. రూ.50 లక్షలతో పనులు కొద్ది రోజులుగా జరుగుతున్నాయి. దీనికి సంబంధించిన నమూనా పరిశీలించి, కార్యాలయంలో చేపడుతున్న పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థలం వృథా కాకుండా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే కార్యాలయం పరిసరాలు పరిశుభ్రంగా వుంచాలన్నారు. ఈవీఎం ఉపయోగంపై అవగాహన కల్పిస్తున్న గదిని పరిశీలించి, నమూనా ఈవీఎంలు ఉంచిన గది వద్ద పోలీసు రక్షణ ఉంచేలా ఏర్పాట్లు చేయాలని జెడ్సీ శైలజావల్లిని ఆదేశించారు. అనంతరం అదనపు కమిషనర్ విశ్వనాథన్ టౌన్ ప్లానింగ్ విభాగం వద్దకు రాగానే సందర్శకులు వుండడాన్ని చూసి వారు ఎందుకు వచ్చారు... పని ఏమిటని ఆరా తీశారు. ఎండాడలో రహదారి ఆక్రమణకు ఓ వ్యక్తి ప్రయత్నించగా ఏసీపీ శాస్త్రి దృష్టికి తీసుకురాగా వెంటనే నిర్మాణ పనులు తొలగించారని, అయితే ఇటీవల మళ్లీ రాత్రి పూట అడ్డంగా నిర్మాణం చేసేశారని సదరు వ్యక్తులు చెప్పారు. తక్షణమే చర్యలు చేపట్టాలని ఏసీపీని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి కిషోర్, సూపరింటెండెంట్ అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలోనే ఇంటి వద్దకు పథకాలు



పిలకవానిపాలెంలో కరపత్రం అందజేసి ఓటు అడుగుతున్న పోతిన శ్రీనివాసరావు, తదితరులు



ఆర్‌జీకే కాలనీలో కరపత్రం అందజేసి ఓటు అభ్యర్థిస్తున్న పోతిన హనుమంతురావు, తదితరులు

మధురవాడ: జీవీఎంసీ 5, 6, 7వ వార్డుల్లో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఆయా ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు అపార్ట్‌మెంట్లు, నివాసాలకు వెళ్లి వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. 5వ వార్డులో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతిన హనుమంతురావు, 6వ వార్డులో న్యాయ విభాగం కార్యవర్గ సభ్యుడు డాక్టర్ గాదె రోశిరెడ్డి, 7వ వార్డులో ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లపాటు ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును మరోసారి గెలిపించుకోవాలని కోరారు. విశాఖ రాజధాని అయితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. జీవీఎంసీ 5వ వార్డు జేఎన్‌యూఆర్‌ఎం ఆర్‌జీకే కాలనీలో నిర్వహించిన ప్రచారంలో పోతిన సురేష్, జేఎస్ రెడ్డి, ఎన్.బాబ్జి, గాయత్రి, సీత, లక్ష్మి, జ్యోత్స్న, శ్రీనివాసరెడ్డి, మోహన్‌రావు, రుషికేష్, టి.ప్రసాదరావు, నర్సింగరావు పాల్గొన్నారు. 6వ వార్డు సృజనా లే అవుట్, సాండ్ అండ్ సాండ్ లే అవుట్‌లో నిర్వహించిన ప్రచారంలో పార్టీ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, వీవీ నరసింహారావు, పోతిన ఎల్లాజీ, అనూష, రవి, వరలక్ష్మి, సియాద్రి కనకరాజు, తాతారావు, బెల్లాన ప్రసాద్ పాల్గొన్నారు. 7వ వార్డు కార్‌షెడ్, పిలకవానిపాలెం పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన ప్రచారంలో పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిళ్లా సూరిబాబు, వంకాయల మారుతీప్రసాద్, కుడితి రామారావు, జగ్గపిల్లి నరేష్, పోతిన శేషుబాబు, ఎస్.నాగభూషణరావు, జగ్గపిల్లి సాయి, బెల్లాపు పాపారావు, పసుపులేటి గోపి, తమ్మినేని వరలక్ష్మి, డాక్టర్ సూర్యనారాయణ, హరి వెంకటసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే పేదలకు న్యాయం

ఆనందపురం : పేద ప్రజలకు పూర్తిగా న్యాయం జరగాలంటే రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులనే గెలిపించుకోవాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం కోరారు. ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరుతూ మండలంలోని బోనిలో సోమవారం ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బంక సత్యం మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, పేదలకు మరింత మేలు జరగాలన్నా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమన్నారు. ఎన్నికలప్పుడు వచ్చి కల్లబొల్లి మాటలు చెప్పే ఇతర పార్టీల నాయకుల మాటలు నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, సర్పంచ్ బోని అప్పలకొండ, బోని సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ పాండ్రింకి శ్రీను, చందక అప్పలస్వామి, కర్రి నాయుడుబాబు, షిణగం అప్పలరాజు, మద్దిల తాతినాయుడు, కనకల శ్రీను, కనకల సీతారామ్, దొకర అప్పలసూరి, బుగత సూరి పాల్గొన్నారు.



సాండ్ అండ్ సాండ్ లే అవుట్‌లో కరపత్రం అందజేసి ఓటు అడుగుతున్న రోశిరెడ్డి, అప్పలరాజు



బోని గ్రామంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

26 మంది వలంటీర్లు రాజీనామా



రాజీనామా పత్రాలతో పద్మనాభం ఎంపీడీవో కార్యాలయం వద్ద వలంటీర్లు

పద్మనాభం : మండలంలోని రెండు సచివాలయాలకు చెందిన 26 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. కోరాడ సచివాలయానికి చెందిన 23 మంది, రెడ్డిపల్లి సచివాలయానికి చెందిన ముగ్గురు రాజీనామా చేశారు. వీరు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో బి.శైలజకు అందజేశారు. ఇటీవల 60 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. మొత్తం రాజీనామా చేసిన వలంటీర్ల సంఖ్య 86కు చేరింది.

బోనిలో 8 మంది...

ఆనందపురం : మండలంలోని బోని సచివాలయ పరిధిలో పని చేస్తున్న 8 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం కోసం ఎన్నికల్లో కృషి చేస్తామన్నారు. ప్రచార కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తామని చెప్పారు.

ఘనంగా స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్



ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

మధురవాడ : మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవాల్లో భాగంగా కల్చరల్ అండ్ స్పోర్ట్స్ మీట్ సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి హాజరైన సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత సుధారాణి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో ప్రావీణ్యం సంపాదించుకోవాలన్నారు. చక్కగా చదివి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి సోమరాజు, ప్రిన్సిపాల్ ఏబీ కోటేశ్వరరావు, డీన్స్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో సోషల్ స్టడీస్‌కు ప్రాధాన్యం



ఎంపిక పత్రాన్ని అందజేస్తున్న పైడిరాజు, మహేశ్వరరావు

విశాఖ విద్య: ప్రభుత్వ బడుల్లో సోషల్ స్టడీస్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని సోషల్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ గౌరవాధ్యక్షుడు ఇమంది పైడిరాజు అన్నారు. సోషల్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. నగరంలోని జూబ్లీ హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడుగా ఇమంది పైడిరాజు (అడవివరం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం), అధ్యక్షుడిగా సింగంపల్లి రామారావు(జీహెచ్ఎస్ పెందుర్తి), ప్రధాన కార్యదర్శిగా వి.బాలాజీ ఎంపికయ్యారు. మహిళా ప్రతినిధిగా ఎస్. సంధ్యారాణి (ప్రభుత్వ క్వీన్ మేరీ స్కూల్), గౌరవ సలహాదారుగా ఎస్.కృష్ణారావు, రాష్ట్ర కౌన్సిలర్‌గా టీ. రామారావు, అకడమిక్ సెల్ కన్వీనర్‌గా ఆర్ వీ.నారాయణను ఎన్నుకున్నారు. అదేవిధంగా అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.పాండవులు, ఆర్థిక కార్యదర్శిగా ఎంవీఆర్ సోమరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోషల్ స్టడీస్‌పై విద్యార్థుల్లో ఆసక్తిని పెంచేలా భవిష్యత్‌లో కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ ఎస్.మహేశ్వరరావు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.

'ఒకడే వీరుడు అల్లూరి సీతారామరాజు' చిత్రానికి ఉగాది పురస్కారం



నిర్వాహకుల నుంచి అవార్డు అందుకుంటున్న సత్యనారాయణరాజు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ కురపల్లికి చెందిన సినీ నిర్మాత ఆర్.ఎస్.సత్యనారాయణరాజు 'ఒకడే వీరుడు అల్లూరి సీతారామరాజు' సినిమాకు ఉత్తమ చారిత్రక చిత్రంగా ఉగాది పురస్కారం అందుకున్నారు. ఏపీ ఫిల్మ్ చాంబరు ప్రతినిధులు ఆదివారం రాత్రి విజయవాడలో ఈ అవార్డును ఆర్.ఎస్.సత్యనారాయణరాజుకు అందజేశారు. అల్లూరి సీతారామరాజు వాస్తవ జీవిత చరిత్రపై తీసిన ఈ చిత్రం గత ఏడాది జూలైలో విడుదలయింది. ఈ కార్యక్రమంలో ఏపీ ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు ఎ.ఎం.రత్నం, కార్యదర్శి మోహన్ గౌడ్, సంయుక్త కార్యదర్శి విజయవర్మ పాల్గొన్నారు.